వాడవాడలా వినాయకుడు







గుత్తిలో పండుగ సరుకుల కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న అమృత్ సినిమా థియేటర్ కాలనీ, తాడిపత్రిలో ముస్తాబైన గణేష్ మండపం, తాడిపత్రిలో కొనుగోలు కోసం ఉంచిన గణేష్ విగ్రహాలు

- మండపాల వద్ద యువత సందడి
- పండుగ సరుకుల కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట

తాడిపత్రి టౌన్/తాడిపత్రి రూరల్/గుత్తి/పామిడి/శింగనమల/గార్లదిన్నె/యాడికి: వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తాడిపత్రి, గుంతకల్లు శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో కమిటీ సభ్యులు, యువకులు మండపాలు ఏర్పాటు చేసి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. తాడిపత్రి పట్టణంలో ఐదు రోజులపాటు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వినాయక మండపాల వద్ద రంగురంగుల విద్యుత్ దీపాలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంటున్నాయి. తాడిపత్రి పట్టణంలోని వినాయక కాంప్లెక్స్‌లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఫైవ్‌స్టార్ చాక్లెట్ వినాయకుడు పిల్లలు, యువతను ఆకట్టుకుంటుంది. రూ.లక్షన్నర వ్యయంతో 5,000 ఫైవ్‌స్టార్ చాక్లెట్లతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే విజయనగర్‌కాలనీలో ఉల్లిగడ్డలు, తెల్లగడ్డలతో చేసిన వినాయకుడు గృహిణులను ఆకట్టుకుంటోంది. అదే మండపంలో ఏర్పాటు చేసిన స్టీలు సామాన్ల విగ్రహం చూసేందుకు మహిళలు బారులు తీరారు. తాడిపత్రి ప్రాంత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పోలీసులు నిఘా పెంచారు.



తాడిపత్రిలో ఏర్పాటు చేసిన చాక్లెట్ వినాయకుడు



తాడిపత్రిలో ఉల్లిగడ్డల వినాయకుడు



పామిడిలో సబ్బులు, షాంపూల వినాయకుడు

కిక్కిరిసిన మార్కెట్లు

బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని పూజా సామాగ్రి కోసం వచ్చిన వారితో తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి పట్టణంలోని పలు ప్రాంతాలు మంగళవారం కిక్కిరిసిపోయాయి. ప్రధాన సర్కిళ్లు, మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. ప్రధానంగా అరటి ఆకులు, చెరుకుగడలు, పూలు, వెలక్కాయిలు, మట్టితో చేసిన చిన్న వినాయక విగ్రహాల కోసం ప్రజలు ఎగబడ్డారు. వినాయక చవితి పండుగ కావడంతో వాటి ధరలు అమాంతం పెరిగాయి. జనం రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శింగనమల నియోజకవర్గంలో మూడు రోజుల పాటు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడానికి పోలీసులు అనుమతి తీసుకున్నారు.

క్లుప్తంగా

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. జై శ్రీకృష్ణ , జైజై శ్రీకృష్ణ అంటూ నినాదాలు చేశారు త్రైత సిద్ధాంత కర్తల ఆధ్వర్యంలో గత 11 రోజులుగా నాగల కట్ట వద్ద శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేశారు. మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత కమిటీ అధ్యక్షుడు రవికుమార్, సభ్యులు సూర్యనారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బ్రహ్మయ్య, సురేష్, రామకృష్ణ, చంద్ర, మునేశ్వరి, నారాయణమ్మ, చందు, శ్రీదేవి పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పురాతన కోదండరామస్వామి ఆలయ ధర్మకర్తల మండలిని నియమించడానికి రాష్ట్ర దేవదాయ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఈఓ మఠం మల్లికార్జున తెలిపారు. ధర్మకర్తలుగా నియామకం పొందుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 10లోగా జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌కు రిజిష్టర్ పోస్ట్ లేదా స్వయంగా దరఖాస్తులను అందజేయాలని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440699921 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



యాజమాన్య పద్ధతులను తెలియజేసే పుస్తకాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వాడకం చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం అధికారిణి దయానా బేగం రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని దోసలుడుకి , సంగాల గ్రామాల్లో ఏఓ లీనా వసుంధర ఆధ్వర్యంలో పొలం-పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి దయానా బేగం హాజరై పంటల సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, డ్రోన్‌ల వినియోగం తదితర వాటిపై వివరించారు. అనంతరం పంటల సాగులో యాజమాన్య పద్ధతులను తెలియజేసే పుస్తకాలను ఆవిష్కరించారు.

13న లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి

గుత్తి: స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి తెలిపారు. గుత్తిలోని ఏడీజే కోర్టులో మంగళవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. న్యాయవాదులు, పోలీసుల సమన్వయంతో రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కారం చేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీడీ రత్నం, ఏజీపీ ఫక్రుబాష, సీనియర్ న్యాయవాదులు మనోహర్ బాబు, శ్రీనివాసులు, రాంగోపాల్, ఇస్మాయిల్, రసూల్, నవీన్, శ్రీకాంత్ రెడ్డి, జయరాం రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, దత్తు, కోర్టు సిబ్బంది సాదిక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారిణి ధరణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడిపత్రిటౌన్: మండలంలోని పెద్దపోలమడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ధరణి ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ అనంతక్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజేశ్వరి, పీడీ పక్కీరప్ప తెలిపారు. ఈనెల 30న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే పోటీలలో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, శ్యామల, శివరామిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్రమణ్యం, పురుషోత్తంరెడ్డి, సునీత, భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, మురళీక్రిష్ణ, ఉస్మాన్, క్రిష్ణయ్య, క్రిష్ణవేణి తదితరులు అభినందించారు.

వినాయకచవితి శుభాకాంక్షలు



వై.వెంకటరామిరెడ్డి, సాకే శైలజానాథ్, కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్/శింగనమల/తాడిపత్రిటౌన్: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు వై.వెంకటరామిరెడ్డి, సాకే శైలజానాథ్, కేతిరెడ్డి పెద్దారెడ్డి వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. సకల శాస్త్రాలకు అధిపతి, బుద్ధి, జ్ఞాన ప్రదాత, విఘ్నాలు తొలగించే దైవంగా పూజలందుకునే గణపతి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సౌభాగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు వారు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌కు సత్కారం



పులిబాబును సత్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

గుంతకల్లుటౌన్: గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో రెండు రోజుల క్రితం జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన చాపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచిన వన్‌టౌన్ కానిస్టేబుల్ పులిబాబును డీఎస్పీ శ్రీనివాస్, సీఐ మనోహర్ సత్కరించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను మెడల్‌తో సన్మానించారు. వన్‌టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పొట్ట కొడుతున్న 'కూటమి'



యాడికిలో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపేంద్ర గౌడ్, సంజీవరాయుడు

యాడికి: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు కొత్త ఫించన్లు ఇవ్వకపోగా ..ఉన్న పింఛన్లు పీకేస్తున్నారు....ఇదెక్కడి న్యాయమని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు ధ్వజమెత్తారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంవద్ద కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారుమట్లాడుతూ మండల వ్యాప్తంగా 115 మంది దివ్యాంగుల పింఛన్లు తీసేశారన్నారు. అర్హులైన దివ్యాంగులందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు రాగుల వెంకటరామిరెడ్డి, రామాంజనేయులు, బుజ్జిరెడ్డి, త్రినాథ్, శివ ప్రసాద్, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

గుంతకల్లు రూరల్: తొలగించిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం వేలాది మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించడం దారుణమన్నారు. బాధితులు ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ సచివాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునే దిక్కులేకుండా పోయిందన్నారు. తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వెండి వినాయకుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న నైరుతిరెడ్డి, ఆర్యవైశ్య మహిళలు

గుంతకల్లు: లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించిన వరసిద్ధి వెండి వినాయక విగ్రహాన్ని పట్టణ ఆర్యవైశ్యులు మంగళ వాయిద్యాల నడుమ పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత 29 ఏళ్లుగా వెండి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి వినాయక చవితి ఉత్సవాలను ఆర్యవైశ్యులు ప్రారంభించుకుంటున్న విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం విగ్రహ దాత చంద్రశేఖర్ ఇంట్లో వెండి వినాయకుడికి (120 కిలోల బరువు) వేదపండితులు కేసరి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం వెండి వినాయక విగ్రహాన్ని అలంకరించిన పల్లకిపై కొలువుదీర్చి ఆర్యవైశ్య మహిళలు హారతలిస్తూ ఊరేగింపుగా ముందుకు నడిపారు. గాంధీ చౌక్ వద్ద వెండి వినాయక శాశ్వత సేవ దాత మంచికంటి భాస్కర్ రంగయ్య కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి ప్రధాన రహదారి మీదుగా కన్యకాపరమేశ్వరదేవి ఆలయానికి చేర్చారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి పంచగంగతో అభిషేకం చేశారు. 108 వెండి పుష్పాలతో అర్చన, ఊంజల్ సేవ గావించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి వెండి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

వినాయక ఘాట్ పరిశీలన

గుంతకల్లుటౌన్: గణేష్ ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించనున్న నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా వినాయక ఘాట్ వద్ద ఏర్పాట్లను మంగళవారం కమిషనర్ నయీమ్ అహ్మద్ పరిశీలించారు. ఊరేగింపు జరిగే పురవీధుల్లో శానిటేషన్ పనులు, ఘాట్ వద్ద అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత ఇంజినీర్లు, శానిటేషన్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ సుదర్శన్, ప్రతాప్ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలే మేలు



ఎస్‌ఆర్‌ఐటీలోమట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న డాక్టర్ రంజిత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: పర్యావరణ పరి రక్షణలో భాగంగా వినాయక చవితి వేడుకలకు మట్టి వినాయక విగ్రహాలే ఎంతో మేలని ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణ పరి రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వాడాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలను వాడకం తగ్గించాలన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామవాసి చిరంజీవిరెడ్డి సౌజన్యంతో భక్తులకు 600 మట్టి వినాయ విగ్రహాలను పంపిణీ నిర్వహించారు. అలాగే స్థానిక మంజు టాకీస్ వీధికి చెందిన నాగతేజ గౌడ్ సబ్బులు, షాంపూలతో వినాయక ప్రతిమను రూపొందించారు. ఈ వినాయక ప్రతిమను సరస్వతి విద్యా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురష్కరించుకుని బుధవారం ఏర్పాటు చేయనున్నారు. ఈ బొజ్జ గణపయ్య విగ్రహాన్ని తిలకించడానికి భక్తులు క్యూ కడుతున్నారు.

కుక్కల బెడదను నివారించండి



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద నివారించడంతోపాటు రోడ్ల సమస్య పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గుత్తిలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బార్ మియా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆది నుంచే సమస్యలపై అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ, అరవింద్ పలు సమస్యలను లేవనెత్తారు. కుక్కల బెడద అధికంగా ఉందని వెంటనే నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్య అధికంగా ఉందన్నారు. కనీసం రోడ్లకు మరమ్మతులైనా చేపట్టాలని డిమాండ్ చేశారు. మొత్తంపై కౌన్సిల్ సమావేశం సమస్యలతో హోరెత్తింది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బుసా రూపావతి రెడ్డి, కేవీ రమణ, ఫరూక్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ



వీఆర్‌ఓ శివారెడ్డిని విచారిస్తున్న డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్లలో రైతు రంగనాయకులుకు చెందిన భూమిని కుమారుడు నాగరాజు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ మంగళవారం విచారణ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుణ్యవతితో కలిసి డిప్యూటీ కలెక్టర్ బాధిత రైతు రంగనాయకులు, వీఆర్‌ఓ శివారెడ్డిని విచారించారు. రంగనాయకులుకు 99 సర్వే నంబర్‌లో 3.85 ఎకరాల భూమి ఉంది. ఆయనకు ఇద్దరు కుమారులుండగా చిన్న కుమారుడు సుధాకర్‌కు వాటా ఇవ్వకుండా పెద్ద కుమారుడు నాగరాజు తన భార్య సుజాత పేరిట అక్రమంగా మొత్తం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. వీఆర్‌ఓ శివారెడ్డి తప్పుడు పత్రాలు సృష్టించి భారీగా ముడుపులు తీసుకొని తన భూమిని పెద్ద కుమారుడు నాగరాజు భార్య పేరుపై అక్రమంగా రిజిష్టర్ చేశాడని రైతు ఫిర్యాదు చేశాడు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ విచారణ చేశారు. ఇరువర్గాలను విచారించి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డిప్యూటీ కలెక్టర్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రుష్యశృంగ కొండపై భాగవత పారాయణం

శింగనమల: శింగనమల సమీపంలోని రుష్యశృంగ మహాముని కొండపై మంగళవారం నుంచి భక్తులు భాగవత పారాయణం మొదలు పెట్టారు. రేగడి కొత్తూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో శింగనమల మండలంలోని గోవిందరాయునిపేట, శింగనమల, సోదనపల్లి ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు కొండపైకి వచ్చి భాగవతం పఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రైతులకు సబ్సిడీపై జిప్సం

శింగనమల: మండలానికి 30 టన్నుల జిప్సం వచ్చిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. 50 కేజీల జిప్సం ధర రూ.262.20 కాగా సబ్సిడీ 28.6 శాతం పోనూ రైతు రూ.187.20 చెల్లించాలన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో జిప్సం అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హోటళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలి

గుంతకల్లుటౌన్: హోటళ్లల్లో నాణ్యమైన, శుచి, శుభ్రత కలిగిన ఆహార పదార్థాలను మాత్రమే ప్రజలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి నిర్వాహకులకు సూచించారు. మంగళవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని రెస్టారెంట్లు, భోజన శాలలను మున్సిపల్ పబ్లిక్ హెల్త్, శానిటేషన్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్‌లను శుభ్రంగా ఉంచుకోవాలని, మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిడ్జ్‌లలో పెట్టి రీసైక్లింగ్ చేయరాదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో అదుపు తప్పి ఓ లారీ రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. మంగళవారం లారీని క్రెయిన్‌తో పక్కకు తొలగించే క్రమంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు గంట పాటు వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులు తంటాలు పడ్డారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించడానికి కృషి చేయాలని గుత్తి ఫారెస్ట్ అధికారిణి డిప్యూటీ రేంజ్ అధికారి ఫ్లారెన్స్ దీపా సూచించారు. మంగళవారం మండలంలోని చిన్నవడుగూరు, పెద్దవడుగూరు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు వారికి మొక్కలను పంపిణీ చేశారు. అలాగే ఒక్కో రైతుకు 100 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, ప్రజలకు పాల్గొన్నారు,

గుత్తి: వినాయక పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం గుత్తిలో ఫారెస్టు అధికారులు ప్రజలకు మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు తిమ్మప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

పామిడి: పామిడిలో మంగళవారం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విభాగం జిల్లా అధక్షుడు వైపీ బాబు, మండల అధ్యక్షుడు పీ అనిల్‌కుమార్‌రాజా, ప్రధాన కార్యదర్శి బుజ్జిబాబు స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి, డాక్టర్ కార్తికేయ, శివ, వెంకట్, పాస్టర్స్ అబ్రహాం, సల్మాన్‌రాజ్, జాకబ్ పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో మంగళవారం పెన్షనర్ల అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కుళ్లాయి బాబు, సెక్రెటరీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: పట్టణ జేవీవీ, విక్టరీ ఫౌండేషన్, అమ్మదీవెన సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీవీ టవర్ వద్ద గల మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ హాజరై థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీవీ నాయకులు గంగరాజు, హరిప్రసాద్, విక్టరీ ఫౌండేషన్ నాయకులు డాక్టర్ విజయకుమారి, అమ్మదీవెన సంస్థ అధ్యక్షులు దొడ్డప్ప, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ విజయమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడు సంపత్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకోవాలి

పుట్లూరు/గుంతకల్లు టౌన్/గుంతకల్లు రూరల్/గార్లదిన్నె: వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, మండపాల వద్ద ఎలాంటి వివాదాలు లేకుండా వినాయక కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లో చర్యలు తీసుకోవాలని సీఐ సత్యబాబు సూచించారు. మంగళవారం పుట్లూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద మండలంలోని వినాయక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు. వినాయక ఉత్సవాలు నిర్వహించే వారు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రోడ్లపై, ప్రజలకు ఇబ్బంది కలిగిం చే ప్రదేశంలో విగ్రహాలు ఏర్పాటు చేయరాదన్నారు. వినాయక మండపాలు వద్ద విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. రాత్రి సమయాల్లో కమిటీ సభ్యులు మండపాల వద్ద ఉండాలన్నారు. అలాగే గుంతకల్లు పట్టణం, మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాల వద్ద కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ మనోహర్, కసాపురం ఎస్‌ఐ టీపీ వెంకటస్వామి సూచించారు. అదేవిధంగా గార్లదిన్నెలోని పోలీస్‌స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులకు ఉత్సహం నిర్వహణపై ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా అవగాహన కల్పించారు. మూడురోజుల తర్వాత వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ విజయ్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.